క్లుప్తంగా

తాళ్లూరు లిఫ్ట్ మరమ్మతులకు కలెక్టర్ ఆదేశం


జెడ్పీ సమావేశంలో బిందుమాధవి

జగ్గంపేట: గండేపల్లి మండలం తాళ్లూరు ఎత్తిపోతల పథకం మరమ్మతులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారని జగ్గంపేట జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి తెలిపారు. ఈ లిఫ్ట్ రెండు మూడు రోజుల్లో అందుబాటులోకి వస్తుందంటూ హామీ ఇచ్చారని చెప్పారు. జగ్గంపేటలో మంగళవారం ఆమె ఈ వివరాలు తెలిపారు. మరమ్మతులు చేసినా ఈ పథకం మళ్లీ పని చేయడం లేదని, దీనివలన వరి పంటకు నష్టం జరిగే ప్రమాదం ఉందని జెడ్పీ సమావేశంలో తాను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందించారని తెలిపారు. దీంతో పాటు మండలంలోని పలు సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా కోరామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం కూడా పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో నేడు గడప గడపకూ..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో బుధవారం ఉదయం 10 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు మంగళవారం ఈ విషయం తెలిపారు. ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారని తెలిపారు. తొలుత గ్రామంలో నిర్మించిన నూతన గ్రామ సచివాలయం-2 భవనాన్ని ప్రారంభిస్తారన్నారు.

డ్వామా పీడీ పర్యటన

గోకవరం: మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ పి.జగదాంబ మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించారు. గోకవరం, కృష్ణునిపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. కొత్తపల్లిలో నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభలో పాల్గొని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన పనులను పర్యవేక్షించారు. వేతనదారులకు రూ.272 జీతం వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తహసీల్దార్ సుగుణ, వ్యవసాయాధికారి రాజరాజేశ్వరి ఆధ్వర్యాన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని, పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ పద్మాజ్యోతి, ఉపాధి ఏపీఓ శేష అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటి బిల్వార్చన స్థలం పరిశీలన

తుని రూరల్: వి.కొత్తూరు శివారున ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల ఎదురుగా వచ్చే నెల 4న అయ్యప్ప స్వామి కోటి బిల్వార్చన, పడిపూజ నిర్వహించనున్నారు. ఈ స్థలాన్ని రూరల్ సీఐ ఎ.సన్యాసిరావు, ఎస్సై విజయబాబు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఏర్పాట్లు, ట్రాఫిక్ తదితర అంశాలపై నిర్వాహకులతో చర్చించారు. కోటి బిల్వార్చనకు శబరిమలై దేవస్థానం నుంచి ప్రధానార్చకుడితో పాటు ప్రముఖులు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల నుంచి అయ్యప్ప మాలధారణ చేసిన 10 వేల మంది భక్తులు కోటి బిల్వార్చన, పడిపూజలో పాల్గొంటారని చెప్పారు. అదే రోజు ఉదయం కత్రాళ్ల కొండ అయ్యప్పస్వామి ఆలయం నుంచి తుని పట్టణంలోని వీధుల మీదుగా కోటి బిల్వార్చన వేదిక వరకూ అయ్యప్ప స్వాములతో శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ స్థలం జాతీయ రహదారిని ఆనకుని ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పూజా కార్యక్రమాలకు వచ్చే వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని సీఐ సూచించారు.

రౌతులపూడి - తుని బస్సుకు వినతి

తుని: రౌతులపూడి నుంచి శృంగధార, గిడజాం, పారుపాక మీదుగా తునికి ఆర్టీసీ బస్సు నడపాల్సిందిగా రౌతులపూడికి చెందిన బి.లోవరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఫోన్ ద్వారా ఈ విజ్ఞప్తి చేశారని ఆర్టీసీ తుని డిపో మేనేజర్ ఎస్.కిరణ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే ఉదయం 7.30 గంటలకు ఒక సర్వీసు నడుపుతున్నామని, మరో బస్సు నడిపే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపామన్నారు. ఆర్టీసీ బస్సులలో టికెట్లు ఇవ్వడానికి కండక్టర్లు ప్రయాణికుల వద్దకు రావడం లేదని, కనీసం టికెట్లు తీసుకోమని కూడా అడగడం లేదని ఏలేశ్వరం నుంచి కె.రాంబాబు ఫిర్యాదు చేశారన్నారు. రౌతులపూడి మండలం పైడిపాలకు ఆర్టీసీ బస్సు నడపాల్సిందిగా అక్కడి ఎంపీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం విజ్ఞప్తి చేశారని తెలిపారు.

వైభవంగా అమ్మవారి పడిపూజ


సహస్రార్చనలో పాల్గొన్న భవానీ భక్తులు

ప్రత్తిపాడు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపాన శ్రీ అభయ దుర్గాదేవి ఆలయం వద్ద అమ్మవారి పడిపూజ రాత్రి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పురోహితులు ముత్య నరేష్ ఆధ్వర్యాన విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, సహస్రార్చన చేశారు. పూజా సామగ్రిని ఆలయ కమిటీ సమకూర్చింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భవానీ దీక్షధారులు, భక్తులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్య భాగ్యం

- విస్తృతంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- ఉచితంగా వైద్య సేవలు
- ప్రారంభించిన ప్రజాప్రతినిధులు


రామవరంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని కిట్లు రోగులకు అందచేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట/కోటనందూరు/ఏలేశ్వరం/తుని రూరల్/తొండంగి/గండేపల్లి/తుని/రౌతులపూడి/శంఖవరం/ప్రత్తిపాడు రూరల్: ప్రజలకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం ఆరోగ్య భాగ్యాన్ని అందిస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూడా పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. వేలాది మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, వైద్య సేవలు అందించారు. ఆయా ప్రాంతాల్లో ఈ శిబిరాలను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఏమాత్రం ఖర్చు లేకుండా వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట మండలం రామవరంలో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగని విధంగా ప్రతి గ్రామానికీ వైద్యులు వచ్చి, అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారని అన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులకు పంపిస్తున్నారని చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యాన గర్భిణులకు ఏర్పాటు చేసిన పౌష్టికాహార కిట్లను, రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ఎమ్మెల్యే చంటిబాబు అందచేశారు. కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.
- కోటనందూరు మండలం బొద్దవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ వేగి లక్ష్మితో కలిసి ఎంపీపీ లగుడు శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఏబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- ఏలేశ్వరం మండలం సి.రాయవరంలో నిర్వహించిన శిబిరంలో ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి, పాపారావు ఆధ్వర్యాన రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ చేతుల మీదుగా జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గుమ్ములూరి వెంకటరమణ, అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.
- తుని మండలం డి.పోలవరం-1 సచివాలయం పరిధిలో జరిగిన వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ సీహెచ్‌వీ రమణ వైద్య పరీక్షలు చేయించుకుని ప్రారంభించారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గుర్తుర్తి కృష్ణ, కార్యదర్శి గోవిందు, ఎస్.సూరవరం పీహెచ్‌సీ వైద్య, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- తొండంగి మండలం వేమవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ప్రారంభించారు. రోగులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాబు రాజు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, ఎంపీటీసీ కఠారి లక్ష్మణ్, సర్పంచ్‌లు కోడా వర్మ, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- గండేపల్లి మండలం బొర్రంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సందర్శించారు. రోగులు, వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఇప్పటికే కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అనంతరం రోగులకు మందుల కిట్లు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిన్ని వీరబాబు, సర్పంచ్ పోకల సుబ్బు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, ఎంపీడీఓ రామన్, ఈఓ పీఆర్డీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.
- తుని బ్యాంకు కాలనీ సచివాలయం ఆవరణలో వైద్య శిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారని అన్నారు. ఈ శిబిరంలో రెండు వార్డుల ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు, పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దంతులూరి రుపాదేవి, కౌన్సిలర్ చింతకాయ భారతి, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.
- రౌతులపూడి మండలం పి.చామవరంలో ఎంపీడీఓ ఎం.గోవిందు ఆధ్వర్యాన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. 349 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 12 మందిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా 150 మందికి కంటి పరీక్షలు చేసి, ఐదుగురికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు పి.సౌమ్య, వి.శివకుమార్, కె.సరోజ, కె.రాజాజీ, ఎం.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.
- శంఖవరం మండలం జి.కొత్తపల్లిలో వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు ప్రారంభించారు. ఈ శిబిరంలో 401 మందికి వైద్య పరీక్షలు చేశారు. రోగులకు మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు, వైద్యులు శెట్టిబత్తుల రాజీవ్, సౌమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.
- ప్రత్తిపాడు మండలం చింతలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యాన నిర్వహించారు. వైద్యులు కె.మురళీమోహన్‌రెడ్డి, జి.శివకృష్ణ, నీరజ, జీవీ కిరణ్ చౌదరి, ప్రసన్న, పి.సాహితి 432 మందికి వైద్య సేవలు, మెడికల్ కిట్లు అందజేశారు.


బొద్దవరంలో మహిళకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న కోటనందూరు ఎంపీపీ శ్రీనివాస్


తునిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

సచివాలయాలతో చేరువైన ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామ సచివాలయ భవనం ప్రారంభం


రామకృష్ణాపురంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఎంపీపీ తోట రవి

కిర్లంపూడి: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గ్రామ సచివాలయాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. రామకృష్ణాపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, సర్పంచ్ కంటా సరస్వతితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి, ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. తొలుత స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని కూడా సందర్శించారు. గర్భిణులకు, బాలింతలకు పోషకాహార కిట్లు, రోగులకు మందుల కిట్లు అందజేశారు. ఈ శిబిరంలో వైద్యులు హేమాంజలి, సంతోష్ వినీల్, సాయి హేమాంజలి 409 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మరో 19 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు.

జగ్గంపేట: మండలంలోని రామవరంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని, వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేడు పరిపాలనకు సంబంధించిన అన్ని సేవలూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా లభిస్తున్నాయని చెప్పారు. కొన్ని సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు వత్సవాయి సత్యనారాయణరాజు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ..


లబ్ధిదారులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం: ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మల్లవరంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలకు ఎవరైనా అర్హులుంటే సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. గ్రామానికి చెందిన 38 మందికి ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వీటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని, తమ సమస్యను ఎమ్మెల్యేకి ఇటీవల వివరించగా, తక్షణమే స్పందించి, మంజూరు చేశారని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక బీసీ కాలనీ అంగన్‌వాడీ సెంటర్ సమీపాన రూ.7 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే చంటిబాబు శంకుస్థాపన చేశారు. గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించి, రోగులకు మందులు, పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’ను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ వద్ద పార్టీ మండల కన్వీనర్లు, జేసీఎస్ మండల ఇన్‌చార్జిలతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఇందులో భాగంగా పార్టీ నాయకులందరూ ప్రజల్లోకి వెళ్లి, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై మంచి చేస్తున్న ప్రభుత్వంపై చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి, అర్హతే ప్రామాణికంగా నేరుగా ఇంటి వద్దనే పెన్షన్లు, సంక్షేమ లబ్ధి చేకూర్చుతున్నామని అన్నారు. ప్రభుత్వం అనేక మంచి కార్యక్రమాలతో ప్రజల్లో ఆదరణ పొందుతూంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు అవినీతిలో కూరుకుపోయి జైలుపాలయ్యారని చెప్పారు. టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని, తద్వారా వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పర్వత పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు శిగడం వెంకటేశ్వరరావు, పంచాది వీరబాబు, జిగిరెడ్డి శ్రీను, నరాల శ్రీనివాస్, అడపా పార్థసారథి, పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జులు రామిశెట్టి చినబాబు, సామంతుల చిన్నారావు, అలమండ వీరరాఘవస్వామి, బుర్రా లచ్చబాబు, రామకుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివాజీ


శివాజీ, మోహనరంగాలను సత్కరిస్తున్న ఉద్యోగులు

తుని: ఇటీవల భీమవరంలో జరిగిన రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో తునికి చెందిన కుసనం శివాజీ ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర నిర్వహణ కార్యదర్శిగా వై.మోహనరంగా ఎన్నికయ్యారు. వారిని సహోద్యోగులు తుని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. తుని మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, వివిధవిభాగాల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రత్తిపాడు: కోర్టు పిటిషన్లకు స్టాంపు ఫీజును రూ.20కి పెంచుతూ ఇటీవల బార్ కౌన్సిల్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు మంగళవారం నిరసన తెలిపారు. ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య ఆధ్వర్యాన విధులను బహిష్కరించి, రిలే దీక్షలు చేపట్టారు. బార్ కౌన్సిల్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకూ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నెల 20వ తేదీ వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. దీక్షల్లో బార్ కార్యదర్శి బొంగుఖూరి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

బహు రూపిణి.. వరదాయిని..

- వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన జగన్మాత
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- కొనసాగుతున్న శరన్నవరాత్ర ఉత్సవాలు
- గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మకు 108 రకాల ప్రసాదాలతో మహానివేదన


గజ్జనపూడి రాజరాజేశ్వరిదేవి పీఠంలో వెండి జరీ చీరలో దర్శనమిచ్చిన అమ్మవారు


గోపాలపట్నంలో మీనాక్షి దేవిగా నేరేళ్లమ్మ అమ్మవారు


పసుపు కొమ్ముల అలంకారంలో వీరభద్రుని గద్దె కనకదుర్గమ్మ


అన్నపూర్ణాదేవి అవతారంలో కిర్లంపూడి వనదుర్గమ్మ


జగ్గంపేటలో ధన సత్తెమ్మ తల్లికి మహిళలు బోనాలు

గోకవరం/ఏలేశ్వరం/కిర్లంపూడి/జగ్గంపేట/ప్రత్తిపాడు/తొండంగి/గండేపల్లి/ప్రత్తిపాడు రూరల్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం పలు ప్రాంతాల్లో ఆ జగన్మాత వివిధ రూపాల్లో దర్శనమిచ్చింది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

- గోకవరంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ కనకదుర్గమ్మ వారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు 108 రకాల ప్రసాదాలతో మహానివేదన చేశారు. అమ్మవారికి అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం మహానివేదన సమర్పించారు. వీరభద్రుని గద్దెలోని కనకదుర్గమ్మను ఆలయ కమిటీ ఆధ్వర్యాన పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ, వీరభద్రుని గద్దెలోని కనకదుర్గమ్మ వార్లు శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.
- ఏలేశ్వరం తోట వీధిలోని ఆలయ కమిటీ ఆధ్వర్యాన అమ్మవారికి మహిళలు తెలవారుజామున, సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు చేశారు. స్థానిక దిబ్బపాలెం సంతోషిమాత ఆలయం వద్ద, లింగవరం కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- కిర్లంపూడి మండలం జగపతినగరం అభయ దుర్గమ్మ, కిర్లంపూడి వాసవీ కన్యకా పరమేశ్వరి, వన దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వనదుర్గమ్మ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చిల్లంగిలో వేంచేసి ఉన్న కనక దుర్గమ్మ అమ్మవారిని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుటుంబ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. జగపతినగరం నుంచి పలువురు భవానీ భక్తులు విజయవాడ ఇంద్రకీలాద్రికి కాలినడకన ప్రయాణమయ్యారు. సోమవారం అక్కడకు చేరుకుని కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటామని తెలిపారు.
- జగ్గంపేట శెట్టిబలిజపేట శివారు పొలాల్లో ధన సత్తెమ్మ తల్లికి వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది మహిళలు ఊరేగింపుగా తరలి వెళ్లి బోనాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వైభోగుల కొండబాబు తదితరుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది.


ఏలేశ్వరం తోటవీధిలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మకు సమర్పించిన 108 రకాల మహానివేదన

- ప్రత్తిపాడు శివాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన చేశారు.
- తొండంగి మండలం గోపాలపట్నంలో నేరేళ్లమ్మ అమ్మవారు మీనాక్షీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త యడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యాన అర్చకులు పేర్రాజు బృందం అమ్మవారికి ఈ అలంకరణ చేశారు. పరిసర గ్రామాల భక్తులు కుంకుమ పూజలు చేశారు.
- గండేపల్లి మండలం తాళ్లూరులో బాలాత్రిపుర సుందరి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి, పూజలు చేశారు.
- ప్రత్తిపాడు మండలం శరభవరం శివారు గజ్జనపూడిలో శ్రీచక్ర సమేత రాజరాజేశ్వరీదేవి వెండి జరీ చీరలో దర్శనమిచ్చారు. ఈ వెండి జరీ చీరను వ్యవస్థాపక పీఠాధిపతి వరలక్ష్మీ నరసింహరాజు రూ.6 లక్షలతో చేయించారు. ఈ నెల 20న ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్నామని తెలిపారు.

విజయవాడకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

తుని: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని విజయవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 11 గంటలకు, ఉదయం 6.30, 7.15, 8.15 గంటలకు విజయవాడకు బస్సులు బయలుదేరుతాయన్నారు. ఉదయం 5.30కు, మధ్యాహ్నం 3 గంటలకు తుని నుంచి శ్రీశైలానికి బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. భవానీ భక్తులకు కోరుకున్న క్షేత్రం నుంచి విజయవాడ, శ్రీశైలం క్షేత్రాలకు బస్సులు నడుపుతామని తెలిపారు. భవానీ దీక్షధారులు, ఇతర భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కిరణ్‌కుమార్ కోరారు. వివరాలకు 73829 13216, 73829 13016, 73306 51904 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలేశ్వరం: స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ(మాథ్స్, బోటనీ)ల్లో చేరేందుకు గురువారం లోగా రూ.400 ఫీజుతో, ఈ నెల 21 లోగా అపరాధ రుసుంతో చేరవచ్చని వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు రావాలన్నారు. స్పాట్ అడ్మిషన్లతో చేరేవారు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు అర్హులు కారని ఆమె తెలిపారు.